క్లుప్తంగా

ద్విచక్ర వాహన పత్రాలు తనిఖీ

కాగజ్‌నగర్‌రూరల్: అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని అనుకోడ గ్రామంలో ద్విచక్ర వాహనాలకు సంబంధించిన పత్రాలు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ యువత అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో శ్రమదానం



శ్రమదానం చేస్తున్న అధికారులు, ప్రజలు

కెరమెరి: స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం, మండల సమాఖ్య, వ్యవసాయ శాఖ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శ్రమదానం నిర్వహించారు. ఆయా కార్యాలయాల ఆవరణల్లో పిచ్చి మొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఎంపీడీవో మహేందర్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఏపీఎం జగదీశ్వర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి భీమయ్య, సర్పంచ్ బైనాబాయి, ఉపసర్పంచ్ నిసార్, తదితరులు ఉన్నారు.

ఎస్సైకి సన్మానం



ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

రెబ్బెన: మండల ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్‌ను ఆదివారం జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు గుల్బం చక్రపాణి ఎస్సైకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిపాక కిరణ్‌కుమార్, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలువేరు రమేశ్, నాయకులు వసంత్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఓడిబియ్యం, పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్	
కుమురంభీం	: చాంగురే బంగారు రాజా
కాగజ్‌నగర్	
వెంకటరమణ	: చాంగురే బంగారు రాజా

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	60
కాకరకాయ	80
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	100
పచ్చిమిర్చి	80
పాలకూర	40
సోరకాయ	80
చిక్కుడు కాయ	100
గోబి(పూల్)	40
క్యాబేజ	60

-ఆసిఫాబాద్‌అర్బన్

రెచ్చిపోతున్నాయి..!



వీధి కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెను పట్టుకున్న ఈ ఫొటోలోని వ్యక్తి పేరు పోతే అంజయ్య. శీర్ష గ్రామానికి చెందిన ఇతనికి 200లకు పైగా గొర్రెలు ఉన్నాయి. కౌటాల గుట్ట సమీపంలో గొర్లను మేతకు తీసుకెళ్లగా ఈ నెల 20వ తేదీన వీధి కుక్కల గుంపు దాడి చేయడంతో రెండు గొర్రెలు మృతిచెందాయి. దీంతో రూ.12 వేల నష్టం వాటిల్లింది.



కౌటాలలో వీధి కుక్కల గుంపు(ఫైల్)

- పగలు కుక్కలు, రాత్రి అడవి పందుల దాడి
- పదుల సంఖ్యలో గొర్రెల మృత్యువాత
- ఆందోళనలో గొల్లకుర్మలు



వీధి కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె

కౌటాల: మండలంలోని శీర్షా గ్రామంలో మొత్తం 272 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరంతా గొల్లకుర్మలు. 200 కుటుంబాలకు పైగా గొర్రెలు, మేకలు పెంచుతూ జీవనం సాగిస్తుంటారు. గ్రామంలో సుమారు 50వేలకు పైగా గొర్రెలు ఉన్నట్లు పశువైద్యాధికారులు చెబుతున్నారు. కొద్ది రోజుల నుంచి వీధి కుక్కలు, అడవి పందులు గొర్రెల మందలపై దాడులు చేస్తుండడంతో గొల్లకుర్మలు ఆందోళన చెందుతున్నారు. ప్రతీరోజు రెండు, మూడు గొర్రెలు దాడిలో మృత్యువాత పడుతున్నాయని వాపోతున్నారు. దాడుల్లో కొద్ది రోజుల నుంచి సుమారు 80కి పైగా గొర్రెలు మృతిచెందాయి. దీంతో సుమారు రూ.5 లక్షలకు పైగా నష్టం వాటిల్లింది.

గుంపుగా వచ్చి దాడులు

గ్రామంలోని గొల్లకుర్మలు కౌటాల గుట్ట ప్రాంతానికి జీవాలను మేతకు తీసుకెళ్తుంటారు. గొర్రెలు మేస్తున్న సమయంలో ఒక్కసారిగా పదుల సంఖ్యలో వీధి కుక్కల గుంపు వచ్చి మందలపై దాడులు చేస్తున్నాయి. దీంతో జీవాలు మృతి చెంది జీవాలపై ఆధారపడి జీవిస్తున్న వారు ఆర్థికంగా నష్టపోతున్నారు. గొర్రెలకు బీమా సౌకర్యం లేకపోవడంతో బాధితులకు ఎలాంటి నష్టపరిహారం కూడా అందడం లేదు. వీధి కుక్కలు అటవీ జంతువులు జింకలు, దుప్పిలు, గొర్రెల కాపరులపై కూడా దాడికి యత్నిస్తున్నాయి. కాగా పగలు జీవాలపై వీధి కుక్కలు దాడులు చేస్తుండగా రాత్రిళ్లు ఇంటి వద్ద జీవాల కొట్టంలో సేద తీరుతున్న గొర్రెల మందలపై అడవి పందులు దాడి చేస్తున్నాయి. గ్రామానికి ఆనుకొని గుట్ట ఉండడంతో రాత్రి వేళల్లో అడవి పందులు గ్రామంలోకి వచ్చి గొర్రెల మందలపై దాడి చేస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొందని గొల్లకుర్మలు ఆవేదన చెందుతున్నారు.

కట్టడికి చర్యలేవి..?

వీధి కుక్కల నియంత్రణ బాధ్యతను పట్టణాల్లో మున్సిపల్ యంత్రాంగం, గ్రామాల్లో పంచాయతీలు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ఏటా వీటి సంతానోత్పత్తిని నియంత్రించేందుకు శస్త్రచికిత్సలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే



అడవి పంది

జిల్లాలో కొన్నేళ్లుగా ఇలాంటి చర్యలేవి కానరాడం లేదు. దీంతో శునకాల సంఖ్యకు అడ్డుకట్ట పడడం లేదు. గ్రామాల్లో కుక్కల సంఖ్య ఎక్కువగా ఉంటే జనావాసాలకు దూరంగా తరలించాల్సి ఉన్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

ఏం చేయాలో తోచడం లేదు



పగలు వీధి కుక్కలు, రాత్రి అడవి పందులు జీవాల మందలపై దాడులు చేస్తున్నాయి. నాకు 150 గొర్రెలు ఉన్నాయి. ఇటీవల ఇంటి వద్ద ఉన్న గొర్రెల మందపై రాత్రి అడవి పంది దాడి చేసి ఒక గొర్రెను హతమార్చింది. ఇప్పటివరకు గ్రామంలో వీధి కుక్కల దాడిలో 40కి పైగా, పందుల దాడిలో 35కి పైగా గొర్రెలు మృతి చెందాయి. ఏం చేయాలో తోచడం లేదు. – కంబాల భీమయ్య, శీర్ష గ్రామం

పంటలు రక్షించుకునేదెలా..?

బెజ్జూర్: అడవి పందులు పంటలను ధ్వంసం చేస్తుండడంతో మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి, పగలు శ్రమించి పంటలను రక్షించుకుంటే అడవి పందులతో తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు.

రూ. లక్షలు ఖర్చు పెట్టి..

రైతులు ఆరుగాలం కష్టపడి లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట కాత, పూత దశలో ఉండగా అడవి పందులు పంట చేలను సర్వనాశనం చేస్తున్నాయి. మండలంలో 21వేల ఎకరాల్లో పత్తి పంట, 7వేల ఎకరాల్లో వరి, 150 ఎకరాల్లో కంది, 135 ఎకరాల్లో మిర్చి, 35 ఎకరాల్లో మొక్కజొన్న, 5 వేల ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు ఎలుకపెల్లి, చిన్న సిద్దాపూర్, సులుగుపల్లి, పాపన్నపేట, తలాయి, సుస్మీర్, సోమిని, తిక్కపెల్లి, భీమారం, కుంటల మానెపల్లి, రెబ్బెన, కాటేపల్లి తదితర దాదాపు 22 గ్రామపంచాయతీల్లోని పంటలకు అడవి పందుల బెడద తప్పడం లేదు.

ఏటా ఇదే తిప్పలు..

ప్రతీ సంవత్సరం విత్తనాలు విత్తుకునే సమయం నుంచి మొదలుకొని పంట చేతికొచ్చే వరకు రైతులు పంటలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. అయినా అడవి పందులు పంటలను నాశనం చేస్తుండడంతో ఆందోళనకు గురవుతున్నారు. రాత్రివేళ, పగటిపూట కాపలా ఉన్నా ఏదో ఒక సమయంలో అడవి పందులు దూరి తమ పంటలను ధ్వంసం చేస్తున్నాయని వాపోతున్నారు.

ఎకరానికి రూ.50 వేల పెట్టుబడి



ఎకరానికి దాదాపు రూ.50 వేల ఖర్చు పెట్టి పంటలు సాగు చేస్తున్నాం. అడవి పందులు దూరి పంటలను సర్వనాశనం చేస్తున్నాయి. అడవి పందుల బెడద నుంచి పంటలను రక్షించేలా అధికారులు చర్యలు చేపట్టాలి. – గుర్లే పోశయ్య, సిద్దాపూర్

పంటలను ధ్వంసం చేస్తున్నాయి



పంటలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నా ఏదో ఒక సమయంలో అడవి పందులు వచ్చి పంటలను నాశనం చేస్తున్నాయి. పూత, కాత దశలో ఉన్న పంటలు పందుల వల్ల ధ్వంసం అవుతున్నాయి. మొక్కలను పీకేస్తున్నాయి. – నికూరి పెంటుబాయి, ఎలుకపెల్లి

రక్షణ చర్యలు చేపట్టాలని వినతి

బెజ్జూర్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను అడవి పందులు నాశనం చేస్తున్నాయని, వాటి బెడద నుంచి పంటలను కాపాడాలని రైతులు కోరారు. ఈమేరకు మండల కేంద్రంతో పాటు ఎలుకపెల్లి, చిన్న సిద్దాపూర్, కష్టపెల్లి, నాగులవాయి, ఏటిగూడ, ఇతర గ్రామాల రైతులు ఆదివారం మండల కేంద్రంలో ఎఫ్ఆర్‌వో దయాకర్‌కు వినతిపత్రం అందజేశారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా పంట పొలాలను అడవి పందులు ధ్వంసం చేస్తున్నాయని వాపోయారు. అనంతరం దయాకర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల తీర్మానంతో పాటు అడవి పందులు నష్టపరిచిన పంటల వివరాలు సమర్పిస్తే బీట్ ఆఫీసర్లతో కలిసి పరిశీలిస్తామన్నారు. ఉన్నతాధికారులకు నివేదిక అందించి షూటర్లని పిలిపించే ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు కొట్రంగి రామకృష్ణ, గుర్లే అంజయ్య, కుట్రంగి వెంకటి, సెండే శంకర్, చటారి నారాయణ, ఆది అశోక్, నికాడి మోహన్, నికాడి బాపూరావు, పెంటు బాయ్, మల్లేశ్, సంజీవ్, జావిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.



ఎఫ్ఆర్‌వో దయాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సమస్యలు పరిష్కరించాలని నిరసన



కౌటాల: సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు

కౌటాల: తహసీల్దార్ కార్యాలయం ఎదుట 14వ రోజు ఆదివారం అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని, పదవీ విరమణ బెనిఫిట్స్ రూ.10 లక్షలు చెల్లించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, జీజాబాయి, ఇందు, మోక్ష, హేమవతి, సుందరి, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవిలు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేస్తున్న సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దీక్ష శిబిరాన్ని ఆదివారం సందర్శించి అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమణకు కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు సంధ్యారాణి, స్వర్ణలత, రుక్మిణి, బాలమ్మ, తిరుపతమ్మ, ప్రమీల, పద్మ, తార, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.



రెబ్బెనలో..

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

తిర్యాణి: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు గుల్బం చక్రపాణి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పల్లెర్ల విగ్నేష్, మహిళా అధ్యక్షురాలిగా నకుల స్వప్న, యూత్ అధ్యక్షుడిగా పిన్న రవితేజను ఎన్నుకున్నారు. అనంతరం చక్రపాణి మాట్లాడుతూ ఆర్యవైశ్యుల్లోనూ పేదలు ఉన్నారని, వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, దానికోసం ఈ నెల 30న సంఘం ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఆర్యవైశ్యులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కిరణ్ కుమార్, రమేశ్, వసంత్ కుమార్, రాజన్న, రాజేశం, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



గుల్బం చక్రపాణిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

ఎమ్మెల్సీకి సమగ్రశిక్ష ఉద్యోగుల వినతి

కెరమెరి/ఆసిఫాబాద్‌రూరల్: సమగ్రశిక్షలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వడ్డేపల్లి గార్డెన్‌లో నిర్వహించిన పీఆర్‌టీయూ సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష సంఘం జిల్లా బాధ్యులు ఆయనకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉద్యోగులు త్వరలోనే మంచి వార్త వింటారన్నారు. సమగ్రశిక్ష ఉద్యోగులు ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే ప్రకాశ్, ఎస్ఎస్ఏ జిల్లా సంఘ నాయకులు విజయలక్ష్మి, తుకారాం, పవన్‌కుమార్, సందీప్, మోహన్ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి

కోటపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రవీందర్ డిమాండ్ చేశారు. కోటపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆదివారం సందర్శించి సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఆసుపత్రిలో జ్వరాలతో బాధపడుతున్న వారితో మాట్లాడి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకుడు అనిల్, నాయకులు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుడికి పూజలు

కౌటాల: మండలంలోని భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఆయా మండపాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. బాల గణేశ్ మండలి మండపంలో వినాయకుడికి మహిళలు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. గణేశుని పాటలతో మండలంలో ఆయా గ్రామాల్లోని మండపాలు మారుమోగుతున్నాయి.

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి కొదాండ రామాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో 56 రకాల నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఘణపురం బాపూజీ, సుకన్యల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

దహెగాం: గ్రామాల్లో వాడవాడలా కొలువుదీరిన బొజ్జ గణపయ్యకు ప్రతిరోజు పూజలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని స్థానిక శివాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద ఆదివారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో గణేశ్ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. గణేశ్ మండపాల వద్ద ప్రతీ రోజూ ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళహారతులతో మహిళలు హాజరవుతున్నారు. నవరాత్రుల్లో 7వ రోజులో భాగంగా ఆదివారం పట్టణంలోని కేశవనాథ మందిర్, రాజంపేటతో పాటు పలు కాలనీల్లోని గణేశ్ మండపాల వద్ద అన్నదానాలు చేపట్టారు. బాపూనగర్‌లోని శారదా గణేశ్ మండలి వద్ద 121 రకాల ప్రసాదాలు నైవేద్యంగా సమర్పించారు.

రెబ్బెన: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణనాథుడి విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గోలేటిలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి ఆదివారం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ఎస్సై దొలకాసి చంద్రశేఖర్ వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంతో పాటు గంగాపూర్ తదితర గ్రామాల్లో గణేశ్ మండపాల వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



రెబ్బెన: గోలేటిలో పూజలు చేస్తున్న మహిళలు



ఆసిఫాబాద్: బాపూనగర్‌లోని గణేశ్ వద్ద..



దహెగాం: పూజలో పాల్గొన్న మహిళలు



కౌటాల: కుంకుమార్చన పూజలు చేస్తున్న భక్తులు



పెంచికల్‌పేట్: పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరగకుండా చూడాలి

బెల్లంపల్లి: ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరగకుండా చూడాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ కోరారు. ఆదివారం కొత్తగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా ఎన్నికైన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ ఇంటికి వెళ్లి బీజేపీ శ్రేణులు సన్మానించారు. ఈసందర్భంగా ఏమాజీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా ప్రవీణ్ ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నతమైన పదవులు రావాలని ఆకాంక్షించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బి.కేశవరెడ్డి, నాయకులు ఉన్నారు.

కార్యాలయ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



బెజ్జూర్: చిన్నపాటి వర్షానికే మండల కేంద్రంలోని అటవీశాఖ అధికారి కార్యాలయ ఆవరణ చెరువును తలపిస్తోంది. దీంతో అటవీశాఖ అధికారిని కలిసేందుకు వెళ్లే రైతులు, ఇతర సిబ్బంది తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఉన్నతాధికారులు కార్యాలయానికి తనిఖీ నిమిత్తం రాగా నిల్వ నీటి వల్ల లోనికి రాకుండా వెనుదిరిగిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు.

'గ్రూప్-1 రద్దు ప్రభుత్వ వైఫల్యమే'

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రూప్ -1 పరీక్ష రద్దు ప్రభుత్వ వైఫల్యమేనని టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల్కర్ సాయిరాం పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో 2వ సారి గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దయ్యిందన్నారు. నాయకులు రామిల్ల మహేశ్, రేగుంట వేణు, కిషోర్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దు కావడం రాష్ట్ర ప్రభుత్వం, టీఎస్‌పీఎస్సీ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.భీమేశ్ అన్నారు. గ్రూప్-1 బాధితులతో కలిసి ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా ఎదుట ధర్నా నిర్వహించారు.

కెరమెరి: ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల గ్రూప్ 1 రద్దయ్యిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్ ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో అన్నారు. రాంచందర్, భీంరావు, శేఖర్, ఆకాశ్, వేణు, సంజు ఉన్నారు.